



• నగరంలో బీజేపీ బహిరంగ సభ ఏర్పాట్లు

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో

హోరెత్తుతున్న ప్రచారం

- నేడు నిజామాబాద్‌కు రానున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా
- గిరిరాజ్ కళాశాలలో జరిగే బహిరంగ సభలో మధ్యాహ్నం పాల్గొననున్న హోంమంత్రి
- పార్లమెంట్ పరిధిలోని జగిత్యాలలో నేడు జరిగే సభలో పాల్గొననున్న మాజీ సీఎం కేసీఆర్
- నేడు నిర్మల్‌లో జరగనున్న రాహుల్‌గాంధీ సభకు జిల్లా నుంచి తరలివెళ్తున్న కాంగ్రెస్ నేతలు
- అగ్రనేతల పర్యటనలకు ఏర్పాట్లు చేస్తున్న ఆయా పార్టీల నేతలు

నిజామాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ పార్లమెంట్‌పరిధిలో ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల అగ్రనేతలు నేడు ప్రచారానికి వస్తున్నారు. తమ అభ్యర్థుల మద్దతుగా పార్లమెంట్ పరిధిలో జరిగే ప్రచారాల్లో పాల్గొంటున్నారు. అలాగే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కూడా పక్కనున్న ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని నిర్మల్‌లో జరిగే బహిరంగ సభకు నేడు హాజరవుతున్నారు. దీంతో జిల్లా నుంచి కాంగ్రెస్ నేతలు భారీగా తరలివెళ్తున్నారు. మూడు పార్టీల ముఖ్యమైన నేతలు ప్రచారానికి వస్తుండటంతో పార్టీల నేతలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పూర్తిస్థాయిలో తమకు అనుకూలంగా మలుచుకునేందుకు సిద్ధమవుతున్నారు. అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఈ ప్రచారంలో పాల్గొంటున్నారు.

నేడు నగరానికి అమిత్‌షా

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నేడు నిజామాబాద్ నగరంలో జరిగే బహిరంగ సభకు హాజరుకానున్నారు. గిరిరాజ్ కళాశాలలో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు. బీజేపీ అభ్యర్థి సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు మద్దతుగా నిర్వహిస్తున్న భారీ బహిరంగసభలో ఆయన పాల్గొంటున్నారు. ప్రధానిమోదీ 2 నెలల క్రితమే ఈ పార్లమెంట్ పరిధిలోని జగిత్యాలలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. నామినేషన్ సందర్భంగా చివరిరోజు ఉత్తరఖాండ్ సీఎం పుష్కర్‌సింగ్ దామి నిజామాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ప్రచారానికి సమయం దగ్గరపడుతుండటంతో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఈ ప్రచారానికి హాజరవుతున్నారు. పార్లమెంట్ పరిధిలోని మొత్తం కేడర్ హాజరయ్యేలా ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. గిరిరాజ్ కళాశాల మైదానంలో నిర్వహించే ఈబహిరంగ సభకు పార్లమెంట్ పరిధిలోని ఏడు సెగ్మెంట్‌ల నుంచి నేతలతోపాటు కార్యకర్తలంతా హాజరయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కళాశాల మైదానంలో భారీ ఎత్తున టెంట్లను వేసి ఎండ వేడిని తట్టుకుని సమావేశంలో కేడర్ ఉండేలా ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల ప్రచారానికి ఇంకా ఏడు రోజులే సమయం ఉండటం ప్రచారం జోరు పెరుగుతోంది. అగ్రనేతలు వస్తుండటంతో పూర్తిస్థాయిలో తమకు అనుకూలంగా మలుచుకునేలా అభ్యర్థులు ఏర్పాట్లు చేస్తున్నారు. సిర్పూర్, కాగజ్‌నగర్‌లో జరిగే బహిరంగ సభ తర్వాత నిజామాబాద్‌లో జరిగే సభకు హోంమంత్రి వస్తుండటంతో ఎక్కువమొత్తంలో కేడర్ హాజరయ్యేలా ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. సభఏర్పాట్లను ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు పైడి రాకేష్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారితోపాటు ఇతర నేతలు పరిశీలిస్తూ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కేంద్ర హోంమంత్రి ఈ సభకు హాజరవుతుండటంతో పోలీసులు కూడా భారీఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర ఎస్‌పీజీ అధికారుల సూచనల అనుగుణంగా బందోస్తు ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. జిల్లా పోలీసు అధికారులతోపాటు ఇతర జిల్లాల అధికారులు, పోలీసులను రప్పించి బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.

రెండు రోజుల పాటు కేసీఆర్ సభ, రోడ్‌షోలు

ప్రచారానికి సమయం దగ్గర పడుతుండటంతో బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా మాజీ సీఎం కేసీఆర్ పార్లమెంట్ పరిధిలో జరిగే ప్రచారం, సభలు, రోడ్‌షోలలో రెండు రోజులపాటు పాల్గొననున్నారు. పార్లమెంట్ పరిధిలోని జగిత్యాలలో జరిగే రోడ్‌షో, సభ మాజీ సీఎం కేసీఆర్ నేడు హాజరుకానున్నారు. ఈసభను విజయవంతం చేసేందుకు అభ్యర్థితోపాటు ముగ్గురు ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్‌కుమార్, డాక్టర్ కె.సంజయ్‌కుమార్, ప్రశాంత్‌రెడ్డితో పాటు ఇతర నేతలు నిమగ్నమయ్యారు. అభ్యర్థికి మద్దతుగా ప్రచారాల్లో పాల్గొనడంతోపాటు సభ విజయవంతం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈనెల 6న నిజామాబాద్‌లో జరిగే బహిరంగసభలో మాజీ సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు. నగరంలో రోడ్‌షోతో పాటు సభలో ఆయన పాల్గొననుండటంతో ఎక్కువ మొత్తంలో క్యాడర్ హాజరయ్యేలా ప్రయత్నాలు చేస్తున్నారు. పార్లమెంట్ పరిధిలో రెండు రోజులు ఆయన ప్రచారానికి హాజరవుతుండటంతో ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఎమ్మెల్యేలతోపాటు మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు పాల్గొనేలా ఈ ఏర్పాట్లను చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని కామారెడ్డిలో ఈనెల 7న జరిగే సభలో ఆయన పాల్గొననున్నారు. కేసీఆర్ ఎక్కువ మొత్తంలో సమయాన్ని నిజామాబాద్ పార్లమెంట్‌కు కేటాయిస్తుండటంతో తమకు కలిసి వస్తుందని పోటీలో ఉన్న అభ్యర్థి భావిస్తున్నారు. సభ విజయవంతం కోసం బాజిరెడ్డి గోవర్ధన్ పూర్తిస్థాయిలో ఏర్పాట్లను చేసుకుంటున్నారు.

రాహుల్ సభకు తరలివెళ్తున్న జిల్లా నేతలు

ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థికి మద్దతుగా నిర్మల్‌లో జరిగే బహిరంగ సభకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పాల్గొంటున్నారు. అక్కడి పార్టీ నేతలతో పాటు మంత్రి సీతక్క ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈసభలో నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థితో పాటు పార్టీ నేతలంతా పాల్గొననున్నారు. ఎమ్మెల్యేలతోపాటు కార్పొరేషన్ ఛైర్మన్లు, ఇన్‌చార్జిలు హాజరుకానున్నారు.



జగిత్యాల జిల్లాలో ప్రచారంలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

అన్ని వర్గాలకూ అండగా ఉంటా

- బీజేపీ, కాంగ్రెస్‌లను నమ్మి మోసపోవద్దు
- పైడిమడుగు సభలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తాను అన్నివర్గాలకూ అండగా ఉండి సమస్యలను పరిష్కరిస్తానని, బీఆర్‌ఎస్‌కు ఓటేసి గెలిపించాలని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అభ్యర్థించారు. కోరుట్ల నియోజకవర్గం పరిధిలోని పైడిమడుగుతో పాటు కోరుట్ల మున్సిపాలిటీ పరిధి లో ఆయన శనివారం రాత్రి ప్రచారం చేశారు. ఈ సందరర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నేతలు అన్నీ అబద్ధాలే చెప్తున్నారని, వారిని నమ్మి మోసపోవద్దని కోరారు. గత ఎన్నికలలో అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. గల్ఫ్ పాలసీ తీసుకువస్తామని, ముత్యంపేట షుగర్‌ఫ్యాక్టరీని తెరిపిస్తామని చెప్పి ప్రస్తుతం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ఏఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. ఈ ప్రాంతం నుంచి ఎక్కువ మంది గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్నారని, వారి కుటుంబాలు ఇతర ఇబ్బం దుల్లో ఉన్నాయన్నారు. ఎన్నికలు వచ్చినేప్పుడే వారి ఓట్లను దండుకునేందుకు ఎన్నో వాగ్దానాలను కాంగ్రెస్, బీజేపీ నేతలు చేస్తున్నారని అన్నారు. ఎంపీ అర్వింద్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. కేసీఆర్ హయాంలోనే రాష్ట్రం అన్నిరంగాల్లో ముందుకు పోయిందన్నారు. ఈ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ దావ వసంత, మాజీ మంత్రి రాజేశంగౌడ్, మార్క్‌ఫెడ్ మాజీ ఛైర్మన్ లోకభాపురెడ్డి, ఇతర నేతలు పాల్గొన్నారు.



రోడ్ షోకు హాజరైన మహిళలు

ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగాలి: కలెక్టర్

బోధన్‌రూరల్/డిచ్‌పల్లి, మే4: ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అన్నారు. శనివారం బోధన్‌లోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా సదర్శించారు. పట్టణంలోని విజయ మేరి పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో కొనసాగుతున్న కమీషనింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి అధికారులకు పలు సూచనలు చేశారు. బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లలో బ్యాలెట్‌లలో బ్యాలెట్‌పేపర్ అభ్యర్థులకు కేటాయించిన ఎన్నికల గుర్తులను అమలుపర్చుతున్న తీరును పరిశీలించారు. అలాగే డిచ్‌పల్లిలోని డిస్ట్రిబ్యూషన్‌కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఓట్లలెక్కింపు చేపట్టనున్న సీఎంసీ కళాశాలలోనే నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, అసెంబ్లీ నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ రిసీవింగ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి కమిషనింగ్ ప్రక్రియను నిశితంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు.

మాయమాటలు చెప్పే బీజేపీకి గుణపాఠం చెప్పాలి

- ఐదేళ్లు ఏం చేశావని అర్వింద్‌ను నిలదీయండి
- బీజేపీ, బీఆర్‌ఎస్ రెండూ ఒక్కటే..
- కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి

నిజామాబాద్‌రూరల్/ధర్పల్లి/సిరికొండ, మే4: మాయమాటలు చెప్పే బీజేపీకి ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం రూరల్ మండలం గూపన్‌పల్లి, గుండారంలో ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ కార్నర్ మీటింగ్, బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమని, కాంగ్రెస్‌కు ఓటువేసి తనను ఎంపీగా భారీమెజార్టీతో గెలిపించాలని కోరారు. నిజామాబాద్ ఎంపీగా ధర్మపురి అర్వింద్ ఐదేళ్లలో ఎటువంటి అభివృద్ధి చేయకపోగా, తననిచూసి కాక ప్రధాని మోదీని చూసి ఓటేయాలని ప్రచారం చేయడం వింతగా ఉందన్నారు. ఐదేళ్ల పదవీకాలంలో ధర్మపురి అర్వింద్ అరవింద్ ప్రజలకు ఏనాడూ అందుబాటులోలేడని, ఒక్క పనీ చేసిన దాఖలాలు లేవన్నారు. కేవలం



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

అప్పటి ఎంపీ కల్వకుంట్ల కవిత మీద కోపంతో, డీఎస్ మీద అభిమానంతో అర్వింద్‌ను గెలిపించారు తప్ప ఆయన స్వతహాగా గెలవలేదని విమర్శించారు. అదాని, అంబాని వంటి సంపన్న కుటుంబాలకు వేల కోట్లు దోచిపెడుతున్న ప్రధాని మోదీకి రైతులకు రుణమాఫీ చేయడానికి చేతులు రావడం లేదన్నారు. ఏడాదిలో 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ ఇప్పటివరకు ఎన్నిఉద్యోగాలిచ్చారో చెప్పాలన్నారు. మతపరంగా రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం లేకున్నా రాజ్యాంగ విరుద్ధంగా బీజేపీ మత రిజర్వేషన్లు అమలుచేయాలని చూస్తోందని అన్నారు. ఎన్నికల కోసమే బీజేపీ మతాల మధ్య చిచ్చుపెట్టి రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌ది లౌకిక వాదం.. బీజేపీది మతతత్వ వాదం అని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, కాంగ్రెస్ నేతలు కె.నగేష్ రెడ్డి, అరికెల నర్సారెడ్డి, భాగర్తి భాగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

21 ప్యాకేజీపై రైతులకు భరోసా

21 ప్యాకేజీ ద్వారా రైతులందరికి సాగునీరు అందించి భూములన్నీ సశ్యశామలం చేస్తానని రైతులకు నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి హామీఇచ్చారు. శనివారం రాత్రి ఆయన ధర్పల్లి మండల కేంద్రంలో స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం నుండి గాంధీ విగ్రహం వరకు రోడ్‌షో నిర్వహించారు. అలాగే సిరికొండలోనూ ఎంపీ జీవన్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు.

దేశంలో 4కోట్ల ఇళ్లు కట్టిన ఘనత మోదీదే

• బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్

నవీపేట, మే4: గత పదేళ్ల కాలంలో దేశంలోని 4 కోట్ల మంది నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకే దక్కుతుందని బీజేపీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. శనివారం మండలంలోని జన్నేపల్లిలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. కరోనా సమయంలో దేశంలోని 140కోట్ల మందికి 2డోస్‌ల చొప్పున కరోనా టీకాలను ఉచితంగా ఇవ్వడంతో పాటు ప్రపంచంలోని 150 దేశాలకు వ్యాక్సిన్‌ను ఉచితంగా అందజేసిందని పేర్కొన్నారు. త్రేతాయుగానికి చెందిన శ్రీరాముడికి అయోధ్యలో ఆలయాన్ని పునర్ నిర్మించి నరేంద్ర మోదీ యుగ పురుషుడిగా నిలిచాడన్నారు. కరోనా సమయం నుంచి



మాట్లాడుతున్న ధర్మపురి అర్వింద్

ఇప్పటివరకు దేశంలోని నిరుపేదలందరికీ బియ్యాన్ని ఉచితంగా అందించారన్నారు. ప్రపంచంలో భారతదేశ ఆర్థిక అభివృద్ధి గతంలో 11వ స్థానంలో ఉండగా ప్రస్తుతం 5వ స్థానంలో ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మోసపూరితమైన హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి గాడిదగుడ్డు అంటూ ప్రజలకు చూపిస్తూ తిరుగుతున్నాడని, గాడిదగుడ్డు పెట్టేదిలేదు, రాష్ట్రంలో ఆరుగ్యారంటీ స్కీమ్‌లను అమలు చేసేది లేదని ఎద్దేవా చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో కాళేశ్వరం, మిషన్ భగీరథ పథకాలను చేపట్టి రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిందని విమర్శించారు. తాము హామీ ఇచ్చిన మేరకు నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు మంజూరు చేయించానన్నారు. ప్రస్తుతం పసుపు క్వింటాలు ధర రూ.20వేలు దాటిందని అన్నారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే కూలిపోవాలని దేవుడిని మొక్కుకోవాలని మహిళలకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీ.మోహన్ రెడ్డి, మేడపాటి ప్రకాష్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు సరిన్, తదితరులు ఉన్నారు.

డిగ్రీలో చేరేందుకు..

దోస్త్ నోటిఫికేషన్ విడుదల





- డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు దోస్త్ నోటిఫికేషన్ విడుదల
- ఈనెల 6 నుంచి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం
- టీయూ పరిధిలో ఉమ్మడి జిల్లాలో 74 కళాశాలలు
- బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు ఇతర కోర్సుల్లో చేరేందుకు అవకాశం
- టీయూ పరిధిలో గత కొన్నేళ్లుగా డిగ్రీలో 50శాతం కూడా భర్తీకాని సీట్లు

నిజామాబాద్, మే4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో సాంకేతిక విద్య, వృత్తి విద్యకు ప్రాధాన్యత పెరుగుతుండగా సంప్రదాయ డిగ్రీ కోర్సులకు ప్రాధాన్యత తగ్గుతోంది. ప్రతీ ఏడాది ఉన్నత విద్యామండలి రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల ప్రవేశం కోసం దోస్త్ ద్వారా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తున్నా సీట్లు మాత్రం సగానికి మించి భర్తీ కావడంలేదు. రాష్ట్రవ్యాప్తంగా పేరున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, గురుకుల కళాశాలలు మినహాయిస్తే ప్రైవేటు కళాశాలల్లో కొన్ని మాత్రమే పూర్తిస్థాయిలో సీట్లు భర్తీఅవుతున్నాయి. తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో ఉమ్మడి జిల్లాలో వందశాతం సీట్లు భర్తీ కావడంలేదు. నాలుగేళ్లుగా 50శాతానికి మించి డిగ్రీకళాశాలలో సీట్లుభర్తీ కాలేదు. బీటెక్, ఎంబీబీఎస్, హోమియో, ఆయుర్వేద, వెటర్నరీ, అగ్రికల్చర్, ఫార్మసీ, నర్సింగ్‌తోపాటు ఇతరకోర్సుల్లో ఎక్కువగా చేరుతున్నారు. ఈ కోర్సులు కూడా కొంతమంది హైదరాబాద్‌కు వెళ్లి చేరడంతో ఉమ్మడి జిల్లాకళాశాలల్లో సీట్లు ఖాళీగా మిగిలిపోతున్నాయి.

సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

ఉన్నత విద్యామండలి డిగ్రీ కళాశాలల్లో బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏతో పాటు ఇతర కోర్సుల కోసం దోస్త్ ద్వారా సీట్లను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్‌ను జారీచేసింది. ఈ నోటిఫికేషన్ ఆధారంగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆదేశాలను ఇచ్చింది. ఈ దరఖాస్తులను ఫేస్-1, ఫేస్-2, ఫేస్-3 విధానంలో నోటిఫికేషన్‌లో ఇచ్చిన నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. ఈ దరఖాస్తు కోసం షెడ్యూల్‌ను విడుదలచేసింది. ఇంటర్మీడియెట్‌లో వచ్చిన మార్కులకు అనుగుణంగా ఈ కోర్సులలో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. బీఏలో సాంప్రదాయ కోర్సులతోపాటు వృత్తి సంబంధమైన కోర్సులను కూడా ఈమధ్యే ప్రవేశపెట్టారు. బీకాం జనరల్, బీకాం అకౌంటింగ్, బీకాం ఫైనాన్స్ బీకాం టాక్సేషన్‌తో పాటు పలుకోర్సులను ప్రవేశపెట్టారు. వీటితో పాటు బీఎస్సీలో మ్యాథమెటిక్స్ స్టాటిస్టిక్స్ కంప్యూటర్, ఫిజిక్స్ కెమిస్ట్రి, ఎలక్ట్రానిక్‌తో పాటు డాటా సైన్స్ కోర్సులను నిర్వహిస్తున్నారు. బీఎస్సీ సైన్స్‌లో బోటనీ, జువాలజీ, కెమిస్ట్రి, ఫిషరీస్, బయోకెమిస్ట్రి, మైక్రోబయాలజీ, జెనిటిక్స్, ఫుడ్ సైన్స్‌తోపాటు ఇతర కోర్సులను ప్రవేశపెట్టారు. రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన ప్రభుత్వ కళాశాల తోపాటు అన్నివసరులు ఉన్న కళాశాలల్లో కొత్త కోర్సులతోపాటు నాలుగేళ్ల డిగ్రీ కోర్సులను కూడా కొన్నిట్లో ప్రవేశపెట్టారు.

దోస్త్ ద్వారానే అడ్మిషన్లు

తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో ఉమ్మడి జిల్లాలోని డిగ్రీ కళాశాలల్లో కూడా ఈ దోస్త్ ద్వారానే డిగ్రీ కోర్సుల అడ్మిషన్లను భర్తీ చేయనున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు కలిపి మొత్తం 74 కళాశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏతో పాటు ఇతర డిగ్రీ కోర్సుల సీట్లు మొత్తం 33,630 సీట్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రభుత్వ కళాశాలలు 13 ఉండగా వీటి పరిధిలో 7500 సీట్లు ఉన్నాయి. ప్రైవేటు కళాశాలలు 54 ఉండగా వీటి పరిధిలో 24,290 సీట్లు ఉన్నాయి. ఇవే కాకుండా ఉమ్మడి జిల్లాలో 2 బీసీ డిగ్రీ గురుకుల కళాశాలలు ఉండగా వీటి పరిధిలో 500 సీట్లు, 3 మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలు ఉండగా వీటి పరిధిలో 900 సీట్లు, 2 గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలు ఉండగా వీటి పరిధిలో 400సీట్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు ఎక్కువగా ఉన్నా సీట్లభర్తీ పూర్తిస్థాయిలో కావడం లేదు. ప్రభుత్వ గురుకుల డిగ్రీ కళాశాలల్లో మొత్తం సీట్లన్నీ భర్తీ అవుతున్నాయి. కొత్తగా ప్రవేశపెట్టిన ఈ గురుకుల డిగ్రీ కళాశాలల్లో అన్నివసతులు ఉండటంతో విద్యార్థులు పూర్తిస్థాయిలో చేరుతున్నారు. ఇవేకాకుండా నిజామాబాద్‌లోని గిరిరాజ్ కళాశాల, కామారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బాన్సువాడ డిగ్రీకళాశాలల్లో ఎక్కువ మొత్తంలో సీట్లు భర్తీ అవుతున్నాయి. ఇవేకాకుండా ఇతర ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కూడా 70నుంచి 100శాతం సీట్లు భర్తీ అవుతున్నాయి. ప్రైవేటు రంగంలో ఏర్పాటైన డిగ్రీ కళాశాలల్లో మాత్రం ఎక్కువగా సీట్లు భర్తీ కావడంలేదు. యాజమాన్యాలు పూర్తిస్థాయిలో విద్యార్థుల వద్దకు వెళ్లి ఉచితంగా సీట్లు ఇచ్చిన ఎక్కువమంది మొగ్గు చూపడం లేదు. పేరున్న ప్రైవేటు కళాశాలల్లో కొంత మంది చేరుతున్నారు. అవి మినహాయిస్తే మిగతా కళాశాలల్లో కావడం లేదు. డిగ్రీ కళాశాలలో వసతులతో పాటు ప్లేస్‌మెంట్‌లు ఎక్కువగా ఉన్న వాటివైపే విద్యార్థులు మొగ్గుచూపుతున్నారు. కొన్ని డిగ్రీ కళాశాలల్లో ప్లేస్‌మెంట్‌లు ఎక్కువగావస్తుండటంతో విద్యార్థులు చేరుతున్నారు. కొత్త కోర్సుల పట్ల విద్యార్థులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. కంప్యూటర్ సైన్స్, అకౌంట్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, కెమిస్ట్రితో పాటు ఇతర కోర్సులు చేసిన వారికి ప్రైవేటు రంగంలో అవకాశాలు ఎక్కువగా ఉంటుండటంతో వాటిలో ఎక్కువగా చేరుతున్నారు. బీఏలో ఎకనామిక్స్, మార్కెటింగ్, స్టాటెస్టిక్స్ చేసినవారికి కూడా ప్లేస్‌మెంట్ వస్తుండటంతో వాటిలో చేరుతున్నారు. కళాశాలకు ఉన్న పేరుతోపాటు ప్లేస్‌మెంట్‌లు చూసుకొని ఎక్కువమంది డిగ్రీలో చేరుతున్నారు. ఎక్కువమొత్తంలో బీటెక్‌తో పాటు ఇతర కోర్సులకు సైన్స్ విద్యార్థులు మొగ్గుచూపడంతో డిగ్రీ కళాశాలలో గత కొన్నేళ్లగా సీట్లు నిండటంలేదు. టీయూ పరిధిలో కళాశాలలు ఉన్న మూడు విడతల్లో సీట్ల భర్తీ చేసిన 50శాతం కూడా కావడంలేదు. ఈ ఏడాది ప్రైవేటు కళాశాలతో పాటు ప్రభుత్వ కళాశాలల కూడా యాజమాన్యాలు కూడా పూర్తిస్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. దోస్త్ ద్వారా డిగ్రీ కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు నోటిఫికేషన్ వచ్చిందని టీయూ దోస్త్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సంపత్‌రెడ్డి తెలిపారు. ఇంటర్‌లో పెరిగిన కోర్సులకు ఆధారంగా డిగ్రీ కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

15 వరకు దరఖాస్తుల స్వీకరణ

డిగ్రీలోచేరే విద్యార్థులకు ఈనెల15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. వెబ్‌ఆప్షన్ 18వరకు అవకాశం ఇచ్చారు. ఫేస్-1లో సీట్ల అలాట్‌మెంట్‌ను చేసేందుకు జూన్ 3గా నిర్ణయించారు. ఆ తేదీన దరఖాస్తు చేసుకున్న వారికి సీట్ల కేటాయింపును చేయనున్నారు. ఫేస్-1లో చేరేందుకు 10 వరకు అవకాశమిచ్చారు. సీట్లు రానివారు జూన్ 4 నుంచి 13 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఉన్నత విద్యామండలి అవకాశమిచ్చింది. ఫేస్-2లో దరఖాస్తు చేసుకున్న వారికోసం జూన్ 18న ఫేస్-2లో లిస్టును ప్రకటించనున్నారు. రిపోర్టింగ్‌కు జూన్ 24 వరకు అవకాశం కల్పించారు.

కాంగ్రెస్ పాలనతోనే అభివృద్ధి సాధ్యం

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నవీపేట, మే 4: కాంగ్రెస్ పాలనతోనే అభివృద్ధి సాధ్యమని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నాళేశ్వర్, బినోలలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే రాష్ట్రంలో భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు, విశ్వవిద్యాలయాలు, మెడికల్ కళాశాలలతో పాటు నిరుపేదలందరికీ పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలనలో ధరలు విపరీతంగా పెరిపోయాయని పేర్కొన్నారు. గత ఏప్రిల్ ఒక్క మాసంలోనే దేశంలో 2లక్షల కోట్ల రూపాయలను జీఎస్టీ రూపంలో వసూలు చేసిందని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహర్ బిన్ హందాన్, డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, ఎంపీపీ సంగెం శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, మానికేశ్వర్ రావు, మహిపాల్ రెడ్డి, రాంచందర్, విజయ్, బుచ్చన్న, నర్సింగ రావు, ప్రవీణ్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

'కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయం'

బోధన్‌రూరల్,మే4: తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగానే దేశంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదినారాయణ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని వివిధ వార్డులలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేస్తుందని అలాగే కేంద్రంలో అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలవుతాయన్నారు. నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి జీవన్ రెడ్డికి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దాము, తలారి నవీన్, గ్యాస్ ఆదినారాయణలతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో క్లోరోఫాం ముఠా

● పెద్దమల్లారెడ్డిలో పట్టుకున్న సీసీఎస్ పోలీసులు?

భిక్కనూరు, మే 4: పక్కా సమాచారం మేరకు కల్తీకల్లులో ఉపయోగించే క్లోరోఫాం విక్రయించే ముఠాను సీసీఎస్ పోలీసులు భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డిలో శుక్రవారం పట్టుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం గాంధారికి చెందిన క్లోరోఫాం విక్రయించే ముఠా పెద్దమల్లారెడ్డిలో ఒకరికి విక్రయించేందుకు శుక్రవారం అర్ధరాత్రి రాగా పక్కా సమాచారం మేరకు సీసీఎస్ పోలీసులు దాడి చేసి ముఠా సభ్యులను పట్టుకుని వారి వద్ద నుండి రూ.2.5లక్షల నిషేధిత క్లోరోఫాంను స్వాధీనం చేసుకుని వారిని భిక్కనూరు పోలీసులకు అప్పగించారు. కాగా క్లోరోఫాం విక్రయిస్తు పట్టుబడిన వారితో పాటుగా ఇంకెవరెవరు ఉన్నారో భిక్కనూరు పోలీసులు కూపీ లాగుతున్నట్లు సమాచారం. కాగా భిక్కనూరు మండలంలో కల్తీ కాటుకు చాలామంది బలవుతున్నారు. ఇదివరకే ఆంధ్రజ్యోతిలో జోరుగా కల్తీకల్లు అనే శీర్షికను సైతం ప్రచురించిన విషయం విధితమే.



విరాళాలు అందజేస్తున్న భక్తులు, గ్రామస్థులు



తొర్లికొండ ఆలయంలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, మే 4: మండలంలోని తొర్లికొండ గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. శనివారం తెల్లవారు జాము నుంచి భక్తులు కొండపై చేరుకొని స్వామివారి పల్లకిని కొండ చుట్టు ప్రదక్షిణ చేయించారు. అనంతరం ఆలయంలో భక్తులు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. కొండపై నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం నిర్మాణానికి భక్తులు, గ్రామస్థులు విరాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో 10వేల ఇళ్లు కట్టించే బాధ్యత నాదే : ఆర్మూర్ ఎమ్మెల్యే

నందిపేట, మే4: ఆర్మూర్ నియోజకవర్గంలో అర్హులైన వారికి 10వేల ఇండ్లు కట్టించి ఇచ్చే బాధ్యత తనదేనని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. శనివారం నందిపేట మండలంలోని చౌదమ్మ కొండూర్, ఉమ్మెడ గ్రామాల్లో పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉపాధి హామీ కూలీలతో ముచ్చటించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నందున నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులుగా మళ్ళీ ధర్మపురి అర్విందే గెలవాలని, అయితేనే కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు మంజూరు చేయిస్తారని ఎమ్మెల్యే తెలిపారు. అందుకోసం ప్రతీ ఒక్కరు కమలం పువ్వుకే ఓటు వేసి మోదీని మూడవసారి ప్రధాన మంత్రిగా ఎన్నుకోవాలని కోరారు. తనను ఆర్మూర్ ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు ప్రతీఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తానని రాకేష్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, నాయకులు చేస్తున్న మోసపూరిత వాగ్దానాలను ప్రజలు నమ్మవద్దని, వారికి దీటుగా సమాధానం చెప్పాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి సూచించారు. ఈ ఎన్నికల ప్రచారంలో బీజేపీ సీనియర్ నాయకులు కోటపాటి నర్సింహ నాయుడు, కంచెట్టి గంగాధర్, మండల పార్టీ అధ్యక్షులు భూతం సాయరెడ్డి, ఎంపిటీసీసభ్యులు ధాత్రిక రాజు, ఎలిగేటి రాజు తధితరులు ఉన్నారు.



చౌదమ్మ కొండూర్‌లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీలో చేరిన ఏర్గట్ల మైనార్టీ సంఘ సభ్యులు

ఏర్గట్ల, మే 4: మండల కేంద్రానికి చెందిన మైనార్టీ సంఘ సభ్యులు శనివారం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ముత్యాల సునీల్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండలాధ్యక్షుడు సోమ దేవరెడ్డి, బద్ధం లింగారెడ్డి, ముస్కు మోహన్, ఓర్సు రాములు, మునీర్, రేండ్ల రాజారెడ్డి, బెజ్జారపు బాను కార్యకర్తలు పాల్గొన్నారు.

'అర్వింద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి'

ఏర్గట్ల, మే 4: బీజేపి ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలేటి మల్లికార్జున్ రెడ్డి కోరారు. శనివారం మండలంలోని తాళ్ళరాంపూర్, తొర్తి గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ కేంద్రంలో మోదీని, నిజామాబాద్‌లో అర్వింద్‌కు ఓటు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తోకల నర్సయ్య, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'మరోసారి బీజేపీని గెలిపించండి'

ఆర్మూర్ రూరల్, మే4: రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి మరోసారి కేంద్రంలో బీజేపీని గెలిపించాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. శనివారం రాత్రి ఆలూర్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. గత పదేళ్ళలో అవినీతి రహిత పాలన అందించిన నరేంద్రమోదీని మరోసారి ప్రధాని కావల్సిన అవసరం ఉందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పసుపుబోర్డు మంజూరు చేయించామన్నారు. అదే విధంగా ఆర్మూర్‌లో మూడు రైల్వే ఓవర్‌బ్రిడ్జిలను చేపట్టామని అన్నారు. నిజామాబాద్ జిల్లా మరింత అభివృద్ధి చెందాలంటే బీజేపీనే గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకు సాధ్యంకాని ఆరు గ్యారంటి పథకాల పేరిట ప్రజలను మోసగిస్తుందని విమర్శించారు. ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ మనప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఎంపీగా ధర్మపురి అర్వింద్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు చేసిందేమిలేదని, బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు విజయభారతిరెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సేల్స్ ట్యాక్స్ ఆఫీసర్‌లమంటూ.. అక్రమ వసూళ్లు

● కామారెడ్డి జిల్లాలో నలుగురు విలేకరుల అరెస్టు

సదాశివనగర్, మే 4 : సేల్స్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ అధికారులం అంటూ అక్రమ వసూళ్లకు పాల్పడిన నలుగురు విలేకరులను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా పెర్కిట్ గ్రామానికి చెందిన నిఖిల్ ఈనెల 2న అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి పెర్కిట్‌కు అశోక్ లైలాండ్ వాహనంలో గూడ్స్ సామాను తీసుకుని వెళ్తున్నాడు. అతని వాహనం కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం మల్లుపేట వద్దకు రాగానే ఎన్‌హెచ్ 44 పై గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు కారులో వచ్చి అతని వాహనాన్ని ఆపారు. తాము సేల్స్ టాక్స్ డిపార్ట్‌మెంట్ అధికారులమని, వాహనంలో గూడ్స్ డాక్యుమెంట్స్ చూపించాలని అడిగారు. ఆ తర్వాత రూ.25వేలు డిమాండ్ చేశారు. అడిగిన డబ్బులు ఇవ్వకుంటే చంపేస్తామని బెదిరించి అతని వద్ద ఉన్న రూ.3 వేల నగదును బలవంతంగా లాక్కున్నారు. ఈ ఘటనపై నిఖిల్ సదాశివనగర్ పోలీసులకు ఫిర్యాదు ఇవ్వగా.. శనివారం నిందితులను పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి ఒక కారు, అరు మొబైల్స్, నగదు సీజ్ చేసి రిమాండ్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో కామారెడ్డి పట్టణంలోని శ్రీరాంనగర్‌కాలనీకి చెందిన చెన్నమగారి మహేష్‌గౌడ్ (విజన్ ఆంధ్ర రిపోర్టర్), పాల్వంచ గ్రామానికి చెందిన కమ్మరి దత్త్రాద్రి (24 ప్రెస్), రాజంపేటకు చెందిన బత్తుల రాజేందర్ (న్యూస్‌బూమ్), తాడ్వాయి మండలం నందివాడ గ్రామానికి చెందిన వెల్పుగొండ ప్రశాంత్ (ఎంఆర్ బూమ్ రిపోర్టర్) ఉన్నట్టు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ వివరించారు. కాగా.. కేసును ఛేదించిన సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్, ఎస్సై రాజు, ఏఎస్సై సాగర్, హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ, సిబ్బంది హమీద్, రాజారెడ్డిలను కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ అభినందించారు.

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

● ఎన్‌సీడీసీఎల్ సంస్థ ఎస్‌ఈ రవీందర్



బోధన్‌లో భద్రత వారోత్సవాలలో మాట్లాడుతున్న దృశ్యం

బోధన్‌రూరల్,మే4: మండు వేసవిలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యమని ఎన్‌సీడీసీఎల్ సంస్థ ఎస్ఈ రవీందర్, డీఈ వెంకట రమణ, ముక్త్యార్ హైమద్‌లు అన్నారు. శనివారం బోధన్‌లో విద్యుత్ భద్రత వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్‌ను క్రమ పద్ధతిలో ఎలా ఉపయోగించుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించారు. సంస్థలో పని చేసే ఉద్యోగులు ప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో పలు సూచనలు చేశారు. సబ్ స్టేషన్‌లలో సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రజలను అసౌకర్యానికి గురి చేయకుండా రైతులకు ఉపయోగించే పంపు మోటార్ల విషయంలో జాగ్రత్తలు, విద్యుత్‌ను ఎలా పొదుపుగా వాడాలి అనే అంశంపై ఉద్యోగులు, ప్రజలకు అవగాహన కల్పించారు. విధి నిర్వహణలో సిబ్బంది భద్రత, బాధ్యతయుతంగా మెలగాలని పేర్కొన్నారు. కళాకారుల బృందం చేసిన పాటలు అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఏడీఈలు బెనర్జీ, రవి కుమార్, ఏఈలు నాయిని కృష్ణ, ఆనంద్, కళ్యాణ్, మితున్, నర్సారెడ్డి, శ్రీనివాస్, రాజశేఖర్ రెడ్డి, సబ్ ఇంజనీర్లు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను ఓడించండి

● సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వెంకట్రామయ్య



మాట్లాడుతున్న వేములపల్లి వెంకట్రామయ్య

పెద్దబజార్, మే 4: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను ఓడించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని కోటగల్లిలో గల ఎన్‌ఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మతోన్మాద పాసిస్టు ప్రజా వ్యతిరేక బీజేపీ నరేంద్రమోదీని ఓడించి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నరేంద్ర మోదీ ఆర్‌ఎస్‌ఎస్ జెండాను అమలు చేస్తూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు దాసు, వేల్పూర్ భూమయ్య, గౌతం, సాయిబాబా, ఖాజామోయినొద్దీన్, సాయిరెడ్డి, శివకుమార్, పరుచూరి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో భక్తుల పూజలు



టీటీడీలో అన్నదాన నిర్వహణ కోసం విరాళం అందిస్తున్న దృశ్యం

బీర్కూర్, మే 4: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో కొలువు దీరిన కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి వారిని శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకు న్నారు. శ్రీవారికి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సన్నిధిలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమ ంలో భక్తులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అన్నదాన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో విరాళాలు అందజేశారు. వీరభద్రరావు అనే భక్త డు 15వేల విరాళం ఆలయ పూజారి నందు పంతులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అప్పారావు, రాంబాబు, నరస రాజు, సత్యనారాయణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

'దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి'

కామారెడ్డి టౌన్, మే 4: దేశంలో 2.68 కోట్ల దివ్యాంగులు ఉన్నారు. కానీ మాకు లోక్‌సభలో ప్రాతినిథ్యం లేదని విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిప్ప దుర్గప్రసాద్ ఒకప్రకటనలో పేర్కొన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో 2.28శాతం మంది మేము ఉన్నామని అయినా చట్టసభల్లో ప్రాతినిథ్యం లేకపోవ డం వ్యవస్థ వైఫల్యమేనని అన్నారు. ఎన్నికలపై ఏ విధమైన ప్రభావం చూపలేని వర్గంగానే దివ్యాంగులను రాజకీయ పార్టీలు పరిగణిస్తున్నా యని తెలిపారు. కనీసం సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కూడా నిర్లక్ష్యం తగదని అన్నారు.

సాంపల్లిలో ఘనంగా చౌడమ్మ ఆలమ వార్షికోత్సవం

డిచ్‌పల్లి, మే 4: మండలంలోని సాంపల్లి గ్రామంలో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన చౌడమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవ ఉత్సవాలను యాదవ సంఘం సభ్యులు ఘనంగా శనివారం నిర్వహించారు. గ్రామంలో యాదవ సంఘం కుటుంబాలు ఇంటికో బోనం తీసి ఊరేగిం పుగా తీసుకొచ్చి అమ్మవారి సమర్పించారు. అనంతరం చౌడమ్మతల్లికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.ఒగ్గుకళాకారులు పాటాలతో ఆకట్టుకున్నారు.

బస్సు సౌకర్యానికి నోచుకోని గ్రామాలెన్నో..

● ఇబ్బందులకు గురవుతున్న మెండోరలోని గ్రామాల ప్రజలు ● పట్టించుకోని అధికారులు



మెండోర మండలంలో నాడు బస్సు(ఫైల్)

మెండోర, మే4: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరు హామీలలో ఒకటి 'మహాలక్ష్మీ' పథకం అమలు చేసి రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం తెచ్చింది కానీ మెండోర మండల ప్రజలకు బస్సుల్లో ఉచిత ప్రయాణానికి దూరంగా ఉన్నారు. మండలంలో రోడ్లు బాగా ఉన్నాయి. గతంలో ఆర్టీసీ సౌకర్యం ఉన్నది కానీ కొన్ని కారణాలతో ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సు కల్పించడంలో అధికారులు కానీ గ్రామపెద్దలు కానీ గ్రామాల్లో ఉన్న రాజకీయ నాయకులు పట్టించుకోక పోవడంతో బస్సుసౌకర్యాన్ని పునరుద్ధరించ లేకపోయారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మండల పరిధిలోని మెండోర, కోడిచర్ల, సావెల్ గ్రామాల ప్రజలకు నాడు ఆర్మూర్ నుంచి ఉదయం రాత్రి వరకు ఐదు, ఆరు ట్రిప్పుల బస్సు సౌకర్యం ఉండేది. దినదినాన బస్సుట్రిప్పులుతగ్గిస్తూ నేడుమూడు గ్రామాలకు బస్సు సౌకర్యం లేకుండా పోయింది. చాకిర్యాల్, సోన్‌పేట్, వెల్కటూర్ గ్రామాల ప్రజలకు నేటికి బస్సు సౌకర్యం లేకపోవడంతో వ్యాపారస్తులు,విద్యార్థులు బస్సుసౌకర్యానికి దూరమవుతున్నారు. అంతేగా కుండా బస్సు సౌకర్యాలు లేకుండా ఆటోలో ప్రయాణికులు ప్రయణిస్తున్నప్పుడు నాడు మెండోర గ్రామశివారులో బావిలో ఆటోబోల్తా పడ్డ ఘటనలో 11మంది ప్రాణాలు కోల్పోయిన కూడా ఆర్టీసీ అధికారులకు మెండోర మండల ప్రజల పైన కొద్దిగా అయిన కనికారం లేకుండా పోయిందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఉత్తర తెలంగాణ జిల్లాల సంప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు నాటి నుంచి నేటి వరకు కూడా బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రాజెక్టు అందాలను తిలకించడానికి వచ్చే పర్యాటకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటు బస్సులు లేక అటు గ్రామాల్లో బస్టాండ్‌లు లేక దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఎండల్లో నిలబడి ప్రైవేటు వాహనాల కోసం ఎదురుచూస్తున్నా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాష్ట్రప్రభుత్వం 'మహాలక్ష్మీ' పథకం తీసుకొచ్చి మురిసిపోవడంతో తప్ప దాన్ని మండలంలో పలు గ్రామాలకు ఉపయోగించుకోలేక పోతున్నారని మహిళలు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు గ్రామపెద్దలు, గ్రామాల్లో ఉన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు స్పందించి గ్రామాలకు బస్సులను పునరుద్ధరించాలని గ్రామస్థులు విద్యార్థులు, యువకులు కోరుతున్నారు.

బస్సును పునరుద్ధరించాలి



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందని చాలా సంతోష పడ్డాం. కానీ మాగ్రామాలకు ఆర్టీసీ ఎర్ర బస్సు సౌకర్యం లేదు. ఉచిత బస్సు సౌకర్యం తమకు ఉపయోగ పడంలేదు. అధికారులు కానీ గ్రామపెద్దలు గాని పట్టించుకోని బస్సు పునరుద్ధరణ చేస్తే ఉపయోగముంటుంది.

\- కమ్మరి పద్మ, మెండోర

ఆర్మూర్ నుంచి సావెల్ వరకు బస్సు వేయాలి



రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడగానే మా గ్రామానికి బస్సు వేస్తే మహిళలు ఉచిత ప్రయాణం చేసి వారు సంతోషపడేవారు కానీ వారు ఉచిత బస్సు ప్రయాణానికి దూరంగా ఉన్నారు. పాఠశాలలు ఉన్నప్పుడే బస్సు వస్తుంది అధికారులు స్పందించి ఆర్మూర్ నుంచి సావెల్ వరకు బస్సు పునరుద్ధరించాలని కోరుతున్నాము.

\- గుర్రం శ్రీనివాస్, మెండోర

నగరంలో పట్టపగలు దొంగతనం



ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

నిజామాబాద్ అర్బన్, మే 4: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం పట్టపగలే ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. నగరంలోని వినాయక్‌నగర్ ప్రాంతంలోగల వంద ఫీట్ల రోడ్‌లో తుల్జాభవాని ఆలయానికి సమీపంలో ఉన్న పోస్టల్ శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న మధుమోహన్ నివాసంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. మధ్యా హ్నం తన భార్యతో కలిసి మధుమోహన్ బయటకు వెళ్లగా ఆయన తిరిగి వచ్చేంతలోపు దొంగలు ఇంటి తాళం పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. 5 తులాల బంగారం, 2కిలోల వెండిని దొంగలు ఎత్తుకెళ్లారు. బయటకు వెళ్లి వచ్చిన మధుమోహన్ ఇంటి తాళం పగలగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో ఆయన పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న నాల్గవ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

● చోరీకి గురైన ఆటో లభ్యం

నగరంలోని మూడో టౌన్ పోలీస్ స్టేషన్‌లో చోరీకి గురైన ఆటోను పోలీసులు వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. టీఎస్16యుబి7808 గల ఆటో దొంగతనానికి గురైంది. దీంతో స్థానికులు డయల్ 100కు ఫోన్ చేశారు. ఆటో బైపాస్ రోడ్‌లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ఆటో దొంగిలించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

వడదెబ్బ తగలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి

● ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలి : ఎంపీపీ రజిని



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రజిని కిషోర్

రెంజల్,మే4: ఎండలు తీవ్రతరం అవ్వడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు అందుబాటులో ఉండి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించాలని ఎంపీపీ రజిని కిషోర్ అన్నారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రజిని కిషోర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాలలో ఆరోగ్య కేంద్రాలలో ఏఎన్ఎంలు అందుబాటులో ఉండి ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచి అందించాలని, పని ప్రదేశాలలో టెంట్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని ఎంపీపీ రజిని అన్నారు. ఉపాధి హామీలో పనులు చేపట్టకుండానే హాజరు వేసి పార్టీ మీటింగ్‌లకు పంపుతున్నారని నీలా ఎంపీటీసీ స్వప్న సభ దృష్టికి తీసుకువచ్చారు. ఉపాధి హామీ పనులను ఆపి పార్టీ మీటింగ్‌లకు పంపించడం ఏమిటని, ఉపాధి హామీ పనులు చేపట్టే ఫీల్డ్ అసిస్టెంట్లు ఎలా పంపిస్తారని, పార్టీ మీటింగ్‌కు వెళ్లే వారికి హాజరు సరికాదని ఇలాంటి పనులు చేపట్టే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. వీరన్నగుట్ట గ్రామంలో ఏడు గ్రూప్‌లకు సంబంధించి స్త్రీనిధి రుణాలు అందడం లేదని పలుమార్లు సీఏలకు చెప్పిన కూడా పట్టించుకోవడం లేదని వీరన్నగుట్ట ఎంపీటీసీ లత ఏపీఎం చిన్నయ్యను నిలదీశారు. గత కొన్ని నెలలుగా గ్రామంలో స్త్రీనిధి రుణాలను సంఘాలకు అందించడం లేదని, ఇతర గ్రామాలను రుణాలను ఎలా అందిస్తారు, వీరన్నగుట్ట గ్రామంలో ఎందుకు అందించారని ఏపీఎంను నిలదీశారు. నీలా గ్రామంలో 2.30లక్షల సంఘం నిధులు ఆడిట్ చేయించిన కూడా రికవరీ చేయలేదని సీఏను విధుల నుండి తొలగించి గ్రూప్‌కు సంబంధించిన 2.30లక్షల లెక్క తేల్చాలని నీలా ఎంపీటీసీ స్వప్న ఏపీఎంను కోరారు. పలుమార్లు ఏపీఎం దృష్టికి తీసుకువచ్చిన కూడా సంఘం నిధులు లెక్క చెప్పకుండానే సమాచారం దాట వేస్తున్నారని సభ దృష్టికి తెచ్చారు. వీరన్నగుట్ట పాఠశాలలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని, మన ఊరు, మన బడిపథకం ద్వారా గ్రామంలోని పాఠశాలను ఎంపిక చేస్తే నేటి వరకు పనులు చేపట్టింది లేదని ఎంఈవో గణేష్‌రావును ఎంపీటీసీ లత నిలదీశారు. పాఠశాల ప్రహరిగోడ తొలగించి పనులు ప్రారంభించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మండలంలో జీరో బిల్లులు ఎన్ని వచ్చాయో వాటి వివరాలు తెలుపాలని ఎంపీపీ ట్రాన్స్‌కో ఏఈ రాజలింగంను కోరగా మండలంలో ఇప్పటి వరకు 5399 మంది లబ్దిదారులకు జీరో బిల్లులు వచ్చాయని, ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువరావాలని, లేదా మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రంలో ఫిర్యాదులు చేయాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా తాడ్‌బిలోలిలోని గ్రామంలోని ఇందిరమ్మ కాలనీకి మిషన్ భగీరథ నీరు అందడం లేదని నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని తాడ్‌బిలోలి ఎంపీటీసీ లక్ష్మి ఏఈ గబ్బర్‌సింగ్‌ను ప్రశ్నించారు. త్వరలోనే వాటి సమస్యను పరిష్కరిస్తామని సభ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ విజయ సంతోష్, ఎంపీడీవో శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ డీఈ మున్నీ నాయక్, ఎంఈవో గణేష్‌రావు, ఎంపీటీసీ సభ్యులు రుక్మిణి, లక్ష్మి, లత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బిల్లుల కోసం కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తా

\- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



బాన్సువాడ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడటౌన్ / బాన్సువాడ , మే 4: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బాన్సువాడ నియోజకవర్గంలో పేదలకు 11వేల డబుల్ ఇళ్లను మంజూరు చేశామని, వాటి బిల్లుల కోసం జిల్లా కలెక్టరేట్ ముందు కుటుంబంతో సహా ధర్నా చేపడతానని మాజీ స్పీకర్ , ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం రాత్రి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బకాయి బిల్లులు చెల్లించకపోతే ఎంతవరకైనా వెళ్తానన్నారు. పేదల కోసం మంజూరు చేసిన ఇళ్ల బిల్లులను ప్రభుత్వం ఆపివేయడం భావ్యం కాదన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయిందని , ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి పోచారం భాస్కర్‌రెడ్డి , నాయకులు , కార్యకర్తలు తదితరులున్నారు.

స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన ఎన్నికల అబ్జర్వర్

మద్నూర్, మే 4: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల అబ్జర్వర్ శనివారం మండల కేంద్రంలో గోపాల్ జీ తివారీ (ఐఎఎస్) ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంను తనిఖీ చేశారు. ఈవీఎం యంత్రాలు, భద్రపరిచిన తీరు తదితర విషయాలను అధికారి శ్రీనివాస్ రెడ్డిని అడిగితెలుసుకున్నారు. పోటీ చేస్తున్న సభ్యుల డేటా ఎంట్రీ, సీల్ చేయడం కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ అధికారిశ్రీనివాస్ రెడ్డి, అధికారులు ముజీబ్, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం



హన్మాన్ చాలిసా పారాయణం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కామారెడ్డి టౌన్, మే 4: హిందూవాహిని ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణ్ వార్షికోత్సవ సమ్మేళనంను శనివారం నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హిందూవాహిని రాష్ట్ర అధ్య క్షుడు ఉప్పల రాజన్న, సామాజిక సామరస్యత తెలంగాణ రాష్ట్ర అధ్య క్షుడు అప్పాల ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువులు ప్రతి ఒక్కరూ హనుమంతుని గుణగణాలను మన స్సులో నింపుకుని శ్రీరాముడు చూపించనటువంటి బాటలో ప్రతి ఒక్క రూ నడవాలని అన్నారు. నేటి సమాజంలో విచ్చిన్నమైనటువంటి కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాల్సి నటువంటి బాధ్యత మనదేనని తెలిపారు. యువ కులు చెడు వ్యసనాల వైపు కాకుండా మన పురణా లను గ్రంథాల ను, రామాయణ మహాభారత భగవద్గీతలను అధ్యయనం చేయాలని సూచించారు. రామాయణం మన జీవితానికి మార్గద ర్శకంగా తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో హిందువాహని జిల్లా అధ్యక్షుడు సాయికిరణ్, నగర అధ్యక్షుడు తరుణ హనుమాన్ చాలీ సా, పారాయణప్రముఖ్ జగదీష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్టుకాలనీలో భక్తహన్మాన్ ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం హన్మాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. కాలనీవాసులు ప్రత్యేక పూజలు హన్మాన్ చాలీసా పారాయణం పఠించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల శివరాజ్‌కుమార్, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోనికొండ అశోక్, ఎర్ర భూమయ్య, నర్సయ్య, శంకర్, ఎల్‌టి.కుమార్, సాయన్న, గణపతి, జీవన్, మురళీ, పోశెట్టి, సాయినాథ్, సతీష్, బాజన్న, తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మినర్సయ్య

నిజామాబాద్ లీగల్, మే 4: రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా అధికారులతో నిర్వహించిన నూతన చట్టాలపై అవగాహన సదస్సులో జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మి నర్సయ్య పోలీసులకు, కోర్టు సిబ్బందికి శనివారం జిల్లా కోర్టు ఆవరణలో నూతన చట్టాల అమలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త న్యాయ చట్టాలు భారతీయ న్యాయ సంహిత్, భారతీయ నాగరిక సురక్ష, భారతీయ సాక్ష అధినియం జూలై నుండి ఈ చట్టాలు అమల్లోకి వస్తున్నాయని వీటి గురించి క్లుప్తంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవిరాజ్, బంటు వసంత్, రాజారెడ్డి, బూసారపు రాజేష్‌గౌడ్, సమ్మయ్య, ఉమ్మడి జిల్లా డివిజన్‌లోని పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై దాడి.. కేసు నమోదు



పంచాయతీ కార్యదర్శిపై దాడి చేస్తున్న దృశ్యం

ఎడపల్లి, మే 04: పంచాయతీ కార్యదర్శిపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎడపల్లి మండలంలోని దుబ్బాతాండ గ్రామంలోని నేనావత్ దేవిసింగ్ తన ఇంటి దగ్గర ఉన్న డ్రైనేజి మధ్యలో మంచినీటి పైపుకు రంధ్రం చేసి స్వంతంగా ట్యాపు ఏర్పాటు చేసుకోవడంతో గ్రామంలోని మిగతా వారికి నీరు వెల్లక పోవడంతో గ్రామస్థుల ఫిర్యాదు మేరకు దానిని డమ్మీ చేపించడానికి పంచాయతీ కార్యదర్శి ప్రయత్నించగా నేనావత్ దేవి సింగ్, అతనిభార్య నీల ఇద్దరు కలిసి చేతులతో, కర్రలతో పంచాయితీ కార్యదర్శి సాయి కుమార్ యాదవ్‌పై దాడి చేశారని పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మోదీ పాలనలో అన్నీ ప్రైవేటుమయం

● మాజీఎమ్మెల్సీ రాములునాయక్

ఆర్మూర్‌రూరల్, మే4: దేశంలో నరేంద్రమోదీ పాలనలో ప్రభుత్వ సంస్థాలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటుపరం చేస్తున్నారని మాజీఎమ్మెల్సీ రాములు నాయక్ అన్నారు. శనివారం ఆర్మూర్ పట్టణంలో పీవీఆర్ భవన్‌లో నియోజవర్గ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడవ సారి నరేంద్ర మోదీ అధికారంలోకి వస్తే చైనా, ఉత్తరప్రదేశ్ తరహాలో ఇండియా తయారవుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో పార్లమెంట్ అభ్యర్థి జీవన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. గతంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని, మిగత హామీలను ఎన్నికల తర్వాత అమలయ్యేలా చూస్తామన్నారు. బీజేపీకి ఓటు వేసి మోసపోవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు సాయిబాబాగౌడ్, సంజయ్‌సింగ్‌బబ్లు, పవన్, అయ్యప్ప శ్రీనివాస్, మారుతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ద్వారా లైసెన్సు పొందిన ఎలక్ట్రిషియన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి

పెద్దబజార్, మే 4: ప్రభుత్వం ద్వారా లైసెన్సు పొందిన ఎలక్ట్రిషియన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని ఎలక్ట్రికల్ వైర్‌మెన్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంత్‌రావు అన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వం ద్వారా లైసెన్సు పొందిన ఎలక్ట్రిషియన్స్‌ను మాత్రమే ప్రజలు తమ గృహ, వ్యాపారా సముదాయాల కోసం ఎలక్ట్రిషియన్ వైరింగ్, వివిధ పనులు నిమిత్తం గుర్తించి తమను వాడుకోవాలన్నారు. కొన్ని సంవత్సరాలుగా ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలలో పనిచేస్తు జీవనం సాగిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నడ్కుడలో హోమ్ ఓటింగ్



ఓటుహక్కును వినియోగిస్తున్న దృశ్యం

డొంకేశ్వర్,మే4: మం డలంలోని నడ్కుడ గ్రా మాల్లో శనివారం హో మ్ ఓటింగ్ నిర్వహిం చారు. గ్రామంలోని 101 ఏళ్ల వృద్ధురాలితో అధి కారులు ఓటు వేయిస్తు న్నారు. ప్రత్యేకంగా ని య మించిన ఎన్నికల సిబ్బంది 85 ఏళ్లు పైబడిన వృద్ధులతో పాటు ఫిజికల్ సమస్యతో ఉన్న వారి ఇళ్ల వద్దకు వెళ్ళి ఓటింగ్ నిర్వహించారు. మండల వ్యాప్తంగా 63ఓటర్లు ఉన్నారని వారిని ఓటు హక్కు వినియోగించుకునేలా అధి కారులు పరిశీలించారు.

రూరల్‌లో పోలింగ్ బూత్‌ల పరిశీలన


గుండారంలో పోలింగ్ బూత్‌లు పరిశీలిస్తున్న ట్రైనీ ఐపీఎస్

నిజామాబాద్ రూరల్, మే, 4: నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల కోసం సిద్ధం చేసిన ఎన్నికల పోలింగ్ బూత్‌లను ట్రైనీ ఐపీఎస్ అధికారి చైతన్యరెడ్డి పరిశీలించారు. శనివారం రూరల్ పరిధిలోని గూపన్‌పల్లి, గుండారం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి, మరుగుదొడ్లు, కూర్చోవడానికి బెంచీల ఏర్పాటు వంటి సౌకర్యాలను పరిశీలించారు.

కొనసాగుతున్న డిగ్రీ కళాశాలల తనిఖీలు


ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ను తనిఖీ చేస్తున్న టీయూ ఆడిట్ సెల్ అధికారులు

డిచ్‌పల్లి, మే 4:2024-25 విద్యాసంవత్సరానికి అనుమతుల తనిఖీల్లో భాగంగా తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో అనుబంధ కళాశాలలు కొనసాగుతున్న ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల,ప్రభుత్వ డి గ్రీ కళా శాల (డిచ్‌పల్లి), ఎస్‌పీఆర్(డిచ్‌పల్లి) కళాశాలలను శనివారం తెలంగాణ వర్సిటీ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తనిఖీ లు చేపట్టారు.యూజీసీ, ఉన్నత విద్యమండలి, తెలంగాణ విశ్వవిద్యాలయం నిబంధనల మేరకు ఈతనిఖీలు నిర్వహిస్తున్నమని, ప్రతి కళాశాలలో ఉన్న వసతులపై తనిఖీలు చేస్తున్నట్లు చంద్రశేఖర్ పేర్కొన్నారు. జాయింట్ డైరెక్టర్ అతిఖ్ సుల్తాన గోరి, ప్రొ. ఆరతి, లావణ్య, రాంబాబు పాల్గొన్నారు.

బోధన్ కోర్టులో చట్టాలపై అవగాహన


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్

బోధన్‌రూరల్,మే4: బోధన్ కోర్టులో శనివారం రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మి నర్సయ్య ఆదేశాల మేరకు కోర్టులో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్‌రావు భారతీయ న్యాయ సంహిత చట్టం 2023 గురించి వివరించారు. భారతీయ నాగరిక సురక్ష సంహిత 2023 గురించి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమ్మయ్య వివరించారు. భారతీయ సాక్ష్య అదినియం న్యాయం 2023 గురించి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి వివరించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐలు వీరయ్య, కోల నరేష్, జయేష్ రెడ్డి, వర్ని ఎస్ఐ కృష్ణ కుమార్, ఎక్సైజ్ ఎస్ఐ ఎండీ జలీలుద్దీన్, రుద్రూర్ ఎస్ఐ అప్పారావు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వందన, కోర్టు కానిస్టేబుళ్లు, ఎక్సైజ్ కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఇక క్యూఆర్ కోడ్‌తో ఓపీ సేవలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెద్దబజార్, మే 4: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఇకనుంచి క్యూఆర్ కోడ్ ద్వారా ఓపీ సేవలను అందుబాటులో ఉంటాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో క్యూఆర్ కోడ్ ఓపీ సేవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం ఈ సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు.మొబైల్ వినియోగదారులు ఏబీడీఎం యాప్ ద్వారా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వచ్చిన క్యూ నెంబర్‌ను ఓపీ కౌంటర్‌లో చెబితే ఓపీ కార్డు జారీ చేస్తామని తెలిపారు.

సమాచార హక్కు చట్టం అనేది
పేద వారికి ఒక వజ్రాయుధం

పెద్దబజార్, మే 4: సమాచార హక్కు చట్టం అనేది పేద వారికి ఒక వజ్రాయుధం లాంటిదని సమాచార హక్కు చట్టం మరియు హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎంఏ సలీమ్ అన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు ఈ చట్టాన్ని వినియోగించుకోవాలని అన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారితనం ఈ చట్టం యొక్క ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు పాల్గొన్నారు.

టెక్నికల్ కోర్సుకు ఎండ కష్టాలు

- సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్న అభ్యర్థులు

నిజామాబాద్ అర్బన్, మే 4: 42 రోజుల పాటు కొనసాగనున్న టెక్నికల్ కోర్సుకు ఎండ తీవ్రత తీవ్ర ఇబ్బందులను కలిగిస్తుంది. ఈనెల 1న ప్రారంభమైన కోర్సు జూన్ 12 వరకు కొనసాగనుంది. అప్పటి వరకు తీవ్ర వేసవి ఉండే అవకాశాలు ఉండగా కోర్సు కొనసాగుతున్న కోటగల్లి బాలికల పాఠశాల అనేక సమస్యలతో ఉంది. పాఠశాల పైకప్పు తీసి మన ఊరు - మన బడి పథకంలో రేకులు వేశారు. దీంతో ఆ రేకుల కింద అభ్యర్థులు కోర్సును కొనసాగిస్తుండటంతో ఎండ వేడితో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మరమ్మతుల్లో భాగంగా పాఠశాలలో విద్యుత్ సరఫరాను తొలగించారు. దీంతో ఫ్యాన్‌లు లేక అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు. పక్కనే జీపీఎస్ పూలాంగ్ పాఠశాల పూర్తి మరమ్మతులతో అన్ని వసతులు ఉన్నప్పటికీ ఆ భవనంలో కోర్సును నిర్వహించకుండా పాత భవనంలోనే నిర్వహించడం విమర్శలకు తావిస్తుంది. 500లకు పైగా అభ్యర్థులు కోర్సులో ఉన్నారు. ఎండవేడితో రేకుల రూమ్‌లలో ఉండలేక వరండాలలో కూర్చుంటున్నారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, పేయింటింగ్, డ్రాయింగ్, తదితర కోర్సుల్లోను నిర్వహిస్తున్నారు. మరో 38 రోజుల పాటు కోర్సు కొనసాగే అవకాశం ఉండటంతో ఇప్పటికైనా నిర్వాహకులు పక్కనే ఉన్న జీపీఎస్ పూలాంగ్ పాఠశాల భవనాన్ని వినియోగిస్తే ఎండ వేడి నుంచి ఇబ్బందులు తొలిగే అవకాశం ఉంది.



జీపీఎస్ పూలాంగ్ పాఠశాల


రేకుల షెడ్డులో కొనసాగుతున్న కోటగల్లి బాలికల పాఠశాల


వరండాలో కూర్చున్న టెక్నికల్ కోర్సు అభ్యర్థులు


రేకుల రూమ్‌లో ఇబ్బందులు పడుతున్న టెక్నికల్ కోర్సు అభ్యర్థులు

ముమ్మరంగా వాహనాల తనిఖీ


వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు

ఇందల్వాయి, మే 4: పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇందల్వాయి మండల కేంద్రంలోని టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. శనివారం హైదరాబాద్, కామారెడ్డి వైపు నుండి నిజామాబాద్ జిల్లాకు వస్తున్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి 50వేల రూపాయలకంటే ఎక్కువ నగదు ఉన్న అక్రమ మద్యంను తరలించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందల్వాయి పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నగదు, మద్యం పట్టివేత

నిజామాబాద్ అర్బన్, మే 4: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న డబ్బు, మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా 9 కేసులు నమోదు కాగా 10లక్షల 31,190 రూపాయల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని ఐదు పోలీస్ స్టేషన్ల పరిధిలో, మాక్లూర్, కమ్మర్‌పల్లి, బాల్కొండ, నందిపేటలో పోలీసులు నగదును స్వాధీనం చేసుకున్నారు. వేల్పూర్ మండలంలో అక్రమంగా తరలిస్తున్న 15.59 లీటర్ల మద్యం దాని విలువ 6,652 రూపాయలు, మొత్తం జిల్లా వ్యాప్తంగా 10లక్షల 37,842 రూపాయల విలువైన డబ్బు, మద్యంను స్వాధీనం చేసుకున్నారు.

ఇందల్వాయిలో మేడే ఉత్సవాలు


జెండా ఎగరవేస్తున్న కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దివెంకట్రాములు

ఇందల్వాయి, మే 4: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం ఇందల్వాయి మండల కేంద్రంలో ఘనంగా మేడే ఉత్సవాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు 138 మేడే ఉత్సవాల సందర్భంగా జెండా ఎగరవేసి మాట్లాడుతూ దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని దేశాన్ని సాశించే పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నాయని అన్నారు. ప్రధానమంత్రి మోదీ పాసిస్టు నియంతృత్వ పోకడలను అవలంబిస్తున్నాడని 2005లో సాధించుకున్న జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సైతం నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నాడని అన్నారు. అందుకోసం మేడే స్ఫూర్తిని తీసుకొని 70 శాతంగా ఉన్న వ్యవసాయ కూలీలకు నష్టం తలపెట్టిన మోదీ, బీజేపీని మట్టి కిరిపించాలని వ్యవసాయ కూలీలందరికి పిలుపునిచ్చారు. ఎవరైతే వ్యవసాయ రంగాన్ని కార్మిక చట్టాలను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కాపాడి మరింత అభివృద్ధి చేస్తారో వారిన ఎన్నికల్లో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాగుల గోవర్ధన్, గంగారాం, లక్ష్మి, అనూష, ఎల్లవ్వ, రాములు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కంజర్‌లో యువకుడి ఆత్మహత్య

మోపాల్, మే 4: మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కంజర్ గ్రామానికి చెందిన గూపన్‌పల్లి ప్రశాంత్ (33) శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. ప్రశాంత్ మద్యానికి బానిసై అప్పులు ఎక్కువ కావడంతో కట్టుకున్న భార్య కూడా పుట్టింటికి వెళ్లిపోవడంతో మానసికంగా ఆందోళనకు చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేడు హోంమంత్రి అమిత్‌షా రాక :ధన్‌పాల్


సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

పెద్దబజార్, మే 4: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో బీజేపీ భారీ బహిరంగ సభకు బీజేపీ అగ్రనేత కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రానున్నారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రానున్నారని లోక్‌సభ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి బీజేపీ పార్టీ కార్యకర్తలు, నాయకులు భారీగా హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు న్యాలం రాజు, గద్దె భూమన్న, లక్ష్మినారాయణ, రోషన్‌లాల్‌బోరా, తదితరులు పాల్గొన్నారు.

టీయూలో కాంగ్రెస్ యువ గ్యారెంటీల పై ప్రచారం

డిచ్‌పల్లి,మే4: కాంగ్రెస్ పార్టీ మొహబ్బత్‌కి దుకాణ్ కార్యక్రమంలో భాగంగా ప్రకటించిన 5 యువ న్యాయ గ్యారెంటీలపై తెలంగాణ యూనివర్సిటీలో ఎన్ ఎస్‌యూఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్లకార్డలను ప్రదర్శించారు.ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వేణురాజ్, వర్సిటీ ఉపాధ్యక్షుడు బానోత్ సాగర్‌లు మాట్లాడుతూ.. గత పదేళ్ల బీజేపీ ప్రభుత్వం విద్యార్థులను, నిరుద్యోగులను మోసం చేసిందని, రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి బీజేపీ మాట తప్పిందని విమర్శించారు. అన్ని రాయితీలు కల్పిస్తు అదానీ, అంబానీలకు దేశ సొమ్మును బీజేపీ దోచిపెడు తుందని విమర్శించారు. ఉద్యోగాల ఇవ్వకుండా మోసం చేసిన బీజేపీ పార్టీకి ఈ ఎన్నికల్లో నిరుద్యోగులు, ఉద్యోగులు బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్య క్రమంలో ఎన్ఎస్‌యూఐ రూరల్ అధ్యక్షుడు ఆశిశ్, నాయకులు రమణ, శశి, అఖిల్, ఆదిత్య, దినకర్, ప్రణీత్, శ్రీరామ్, సాయికుమార్, వర్సిటీ ఎన్ఎస్‌యూఐ కమిటీ సభ్యులు సందీప్, శ్రీను, నవీన్, చందర్, మోహన్, పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల సమన్వయకర్తగా పంచరెడ్డి చరణ్

నిజామాబాద్ అర్బన్, మే 4: నిజామాబాద్ లోక్‌సభ ఎన్నికల కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్తగా యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పంచరెడ్డి చరణ్ నియమితులయ్యారు. ముగ్గురు సమన్వయ కర్తలను నియమించగా అందులో చరణ్‌కు చోటు కల్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్ దిలిప్‌కుమార్, కత్తి వెంకట్‌స్వామిలకు ధన్యవాదాలు తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపుకు కృషి చేస్తానని చరణ్ తెలిపారు.

- టీపీసీసీ కల్లుగీత విభాగం వైస్ ప్రసిడెంట్‌గా ప్రవీణ్‌గౌడ్...

టీపీసీసీ కల్లుగీత విభాగం రాష్ట్ర వైస్ ప్రసిడెంట్‌గా నగరానికి చెందిన ప్రవీణ్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజుగౌడ్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా తన నియామకానికి కృషి చేసిన వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు, జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

నేడు నీట్ ప్రవేశ పరీక్ష

- పది సెంటర్లలో పరీక్ష
- హాజరుకానున్న 3,731 మంది విద్యార్థులు

నిజామాబాద్‌అర్బన్, మే 4: మెడికల్ కళాశాలలో ప్రవేశం కోసం నిర్వహించే నీట్ (నేషనల్ ఎలిజిబిలిటి కమ్ ఎంట్రెన్స్ టెస్ట్) పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్‌టీఏ నీట్ నిజామాబాద్ జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్ మెరిగ తెలిపారు. జిల్లాలో పది పరీక్షా కేంద్రాలలో ఆదివారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5.20 నిమిషాల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 3,731 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.విద్యార్థులను ఉదయం 11గంటల నుంచే పరీక్ష కేం ద్రాల్లోకి అనుమతించడం జరుగుతుందని మధ్యాహ్నం 1.30 తర్వాత వచ్చే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించమన్నారు. విద్యార్థులు చేతి గడియారాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, విలువైన ఆభరణాలు వేసుకొని పరీక్ష కోసం రావద్దన్నారు. విద్యార్థులు తమతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫోటో, పోస్టు కార్డు సైజ్ ఫోటో ఏదైనా ఒరిజినల్ ఐడీప్రూఫ్ తీసుకొని రావాలని ఆయన తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఏదైనా సందేహాలు ఉంటే 8978198421 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

- పరీక్షా కేంద్రాలు ఇవే

ఎస్ఎస్ఆర్ డిస్కవరీ స్కూల్ మాధవనగర్, ఎస్ఎస్ఆర్ సీబీఎస్ఈ స్కూల్ జన్నేపల్లి, ఎస్ఎస్ఆర్ డిగ్రీ కాలేజీ ఖలీల్‌వాడి, నాలెడ్జ్‌పార్క్ ఇంటర్నేషనల్ స్కూల్ బోధన్‌రోడ్, ప్రెసిడెన్సి హైస్కూల్ మోపాల్, నిర్మల హృదయ స్కూల్ సుభాష్‌నగర్, విజయ హైస్కూల్ ముబారక్‌నగర్, క్షత్రియ ఇంజనీరింగ్ కాలేజ్ ఆర్మూర్, నవ్యభారతి గ్లోబల్ స్కూల్ దాసనగర్, కాకతీయ మహిళా ఇంజనీరింగ్ కళాశాల, మానిక్‌బండార్‌లు ఉన్నాయి.

బాధిత కుటుంబానికి పరామర్శ

- రూ.10వేల ఆర్థిక సహాయం అందజేత

ఆర్మూర్‌రూరల్, మే4: వేల్పూర్ మండలం లక్కోర గ్రామానికి చెందిన గట్టు మమత కుటుంబాన్ని శనివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో ఆమె మృతి చెందడంతో వారి కుటుంబాన్ని సునీల్‌కుమార్ పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సారెడ్డి, దామోదర్‌గౌడ్, ఆత్మచరణ్, తదితరులు ఉన్నారు.

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.275	రూ. 295



బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.70,600	రూ.65,100	రూ.840

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1	: ఆ ఒక్కటి అడక్కు (1.35, 7.45)
	: టిల్లు స్క్వేర్ (4.30)
	: బాక్ (10.40)
స్క్రీన్-2	: ద పాల్ గాయ్ (ఇంగ్లీష్) (11.00, 1.50, 7.20, 10.10)
	: గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (4.40)
స్క్రీన్-3	: ప్రసన్నవదనం (1.10, 4.15, 10.10)
	: శబరి (7.20)
స్క్రీన్-4	: ప్రసన్నవదనం (1.10, 7.20)
	: మంజుమ్మల్ బాయ్స్ (4.20, 10.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1	: ఆ ఒక్కటి అడక్కు (10.50, 1.45, 4.40, 7.35, 10.30)
స్క్రీన్-2	: బాక్ (10.40)
	: ప్రసన్నవదనం (1.40, 10.30)
	: మంజుమ్మల్ బాయ్స్ (4.45, 7.40)
స్క్రీన్-3	: బాక్ (1.40, 4.35, 7.30, 10.30)

దేవి	: టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహోల్	: వకీల్ సాబ్ (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్	: బాక్ (11.15, 2.15, 6.15 9.15)
విజయ్	: ఆ ఒక్కటి అడక్కు (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్